www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 11 | మార్చి | 2026
పేజీలు : 8

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి



- మేయర్ మూడ్ గణేష్
- స్వయంగా డ్రైన్ పూడిక తీసిన మేయర్

ప్రజాపక్షం/పాల్వంచ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించి పరిష్కరించాలని కొత్తగూడెం కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్ ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 35,40,44,47 డివిజన్లలో డిప్యుటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పోరేటర్లు వీశంశెట్టి విశ్వేశ్వర రావు, అదుసుమిల్లి సాయిబాబా, నామా కీర్తి, గుర్రం వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి..

వివరాలు 2లో..

నకిలీ దందా కల్తీ కల్లోలం

ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం

l కల్తీ కట్టడిపై పట్టింపేదీ...? l జాడలేని ఫుడ్ సేఫ్టీ అధికారులు

ప్రజాపక్షం/ ఖమ్మం : నకిలీల కాలం నడుస్తుంది. ప్రతి అసలుకు ఇప్పుడు నకిలీ తయారై మార్కెట్‌లో హల్‌చల్ చేస్తుంది. ముఖ్యంగా ఆహార పదార్థాలు, మందులను కల్తీ చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్నారు. ప్రజలు విరివిగా వినియోగించే వస్తువులకు సంబంధించి ఎక్కువగా నకిలీలు చోటు చేసుకుంటున్నాయి. భౌతికంగా చూడటానికి నకిలీ వస్తువు కూడా అచ్చు అసలు మాదిరిగానే ఉండడంతో వినియోగదారులు గుర్తించలేక పోతున్నారు. తయారు చేసే వారికి, విక్రయించే వారికి తప్ప మరోకరు గుర్తించలేనివిధంగా నకిలీలు మార్కెట్‌లో చెలామణి అవుతున్నాయి. ఆహార పదార్థాలతో పాటు రోగ నియంత్రణకు సంబంధించిన మందులలో నకిలీలు రోగులను భయపెడుతున్నాయి. మెడికల్ రంగంలో పెద్ద పెద్ద కంపెనీలకు చెందిన మందులకే ఒక అక్షరం తేడాతో నకిలీ తయారు చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. ఇవి చాలా సందర్భాల్లో ప్రాణాల మీదకి తెస్తున్నాయి.

మిగతా 2లో..

కవిత దీక్ష భగ్నం

-హైదరాబాద్ తరలింపు
-జాగృతి కేంద్ర కార్యాలయం వద్ద దీక్ష

ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దీక్షను మంగళవారం ఉదయం పోలీసులు భగ్నం చేశారు. వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా సోమవారం ఆందోళన చేపట్టిన కవితను అరెస్టు చేసి ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం విడుదల చేశారు. అక్కడి నుంచి నేరుగా అంబేద్కర్ భవన్‌కు చేరుకుని బాధితులతో కలిసి సోమవారం రాత్రి దీక్ష చేపట్టగా పెద్ద సంఖ్యలో పోలీసులు అంబేద్కర్ భవనం వద్దకు చేరుకుని కవిత ఆమెతో పాటు దీక్ష చేస్తున్న..

2 లో

వెలుగుమట్ల బాధితులకు పట్టాలు పంపిణీ

l హాజరుకానున్న మంత్రులు

ప్రజాపక్షం/ ఖమ్మం : వెలుగుమట్ల బాధితులకు నివాస స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరగనుంది. గత నెల 24న వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని భూదాన్ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని దశాబ్దాల పాటు జీవిస్తున్న వారి నివాసాలను బుల్‌డోజర్లతో కూలగొట్టి బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో అధికారులు సర్వే నిర్వహించి 311 మందిని అర్హులుగా తేల్చినట్లు సమాచారం. అర్హులందరికీ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరు కానున్నట్లు అధికారిక సమాచారం.

2లో..

ఇంకా అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు

జీవో అమలుపై సందేహాలు

ప్రజాపక్షం/కూసుమంచి: ప్రభుత్వ కార్యాలయాలను ప్రైవేట్ అద్దె భవనాల నుండి ప్రభుత్వ భవనాలకు మార్చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ, పాలేరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఫైనాన్స్(డబ్ల్యూపి)విభాగం సర్క్యులర్ మెమో నంబర్ 3469202 ఏ/310/ఎక్స్‌డబ్ల్యూపీ/ఏ1/2025 ద్వారా డిసెంబర్ 31, 2025 నాటికి ప్రైవేట్ భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ప్రభుత్వ భవనాలకు మార్చాలని ఆదేశించింది. అలాగే 2026 జనవరి 1 నుండి ప్రభుత్వ కార్యాలయాలు

వివరాలు 2లో..

నకిలీ దందా ... కల్తీ కల్లోలం

(మొదటిపేజీ తరువాయి)

కొన్నింటితో ప్రాణాపాయం లేకపోయినా రోగ నివారణ మందులు లేకపోవడంతో రోజుల తరబడి వాడినా ఫలితం ఉండడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మందుల దుకాణ యజమానులు కమిషన్లకు కక్కుర్తిపడి వీటిని విక్రయిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. అసలు మందుల కంపెనీలు ఆయా కంపెనీల క్రయ, విక్రయాలను బట్టి కమిషన్‌ను నిర్ణయిస్తాయి. కానీ నకిలీ కంపెనీలు 60 నుంచి 70శాతం కమిషన్ ఇస్తుండడంతో మందుల వ్యాపారులు ఈ కమిషన్లకు కక్కుర్తిపడుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. నకిలీ నూనెలు, పప్పులు, పెస్టులు, తినుబండారాలు, ముఖ్యంగా రెడిమెడ్ ఫుడ్‌కు సంబంధించి నకిలీలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం వీటిపై దృష్టిసారించడం లేదు. అరకొరగా తనిఖీలు నిర్వహించడంతో సరిపుచ్చుకుంటున్నారు.

భయపెడుతున్న కల్తీ :

ఇప్పుడు కల్తీ అంత్యంత ప్రమాదకరమైన స్థాయికి చేరింది. అది ఇది అనే తేడా లేకుండా కల్తీలు జరుగుతున్నాయి. ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పు కారణంగా అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లయింది. ఇండ్లలో తయారు చేసే ఆహార పదార్థాల కంటే బయట ఆహార పదార్థాలను తినడం, వినియోగించడం ఇటీవల కాలంలో బాగా పెరిగి పోయింది. ఒక ఖమ్మం నగరంలోనే రోజుకు రూ. 50 లక్షల నుంచి రూ.70 లక్షల రూపాయల ఆహార పదార్థాల వ్యాపారం జరుగుతుంది. మధ్య తరగతి నుంచి సంపన్న వర్గాల వరకు వారంలో ఒక రోజైనా కుటుంబం మొత్తం బయటకు వెళ్లి సరదాగా భోజనం, ఇతర పదార్థాలను తీసుకోవడం అలవాటుగా మారింది. ఆహార పదార్థాలను తయారు చేసే సంస్థలు విపరీతమైన కల్తీలకు పాల్పడుతున్నాయి. నూనెలు, అల్లం పెస్టులు, కారం, పాలు, మొదలైన నిత్యావసర వస్తువులను కూడా కల్తీ చేస్తున్నారు. ఇప్పుడు పండ్లు కూడా పంటకు రాక ముందే కోసి ఇంజక్షన్ల ద్వారా పండిస్తున్నారని అరటి కాయలను ఒకేసారి పంటకు వచ్చేందుకు విష పూరిత ద్రవణంలో ముంచుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఏది కొని తింటే ఏ రకమైన అనారోగ్యం కలుగుతుందోనన్న ఆందోళన రోజు రోజుకు పెరుగుతుంది. ముఖ్యంగా కొన్ని ఆహార పదార్థాలలో విషపూరితమైన రంగులను వినియోగిస్తున్నారు. ఇవి ప్రభుత్వ పరంగా నిషేధంలో ఉన్న కానీ వినియోగంలో మాత్రం ఆగడం లేదు. పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా కల్తీలకు వినియోగిస్తుండడం గమనార్హం. గతంలో ఖమ్మంలో కోట్ల రూపాయల విలువైన నకిలీ కారం దొరికిన విషయం విధితమే. పాలలో కల్తీ కూడా బయట పడిన విషయం అందరికీ తెలిసిందే. సరదా భోజనం , ఆహార పదార్థాల సేకరణతో అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నామన్న వాస్తవాన్ని వినియోగదారులు గుర్తించాల్సి ఉంది.

పట్టించుకోని తనిఖీ అధికారులు :

ప్రతి రోజు లక్షల్లో వ్యాపారం జరుగుతుండటం ఆహార పదార్థాల్లో కల్తీ చోటు చేసుకుంటుండడంతో అప్రమత్తం కావాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆ విషయాన్ని మరిచిపోతున్నారు. ఆరు నెలలకో, ఏడాదికో తమకు నచ్చని లేద మామూళ్లు ఇవ్వని తయారీ సంస్థలపై దాడులు చేయడం, తూతూ మంత్రంగా కేసులు నమోదు చేయడం మినహా మరె పని చేయడం లేదని ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిరంతర పర్యవేక్షణ లేకపోవడం కారణంగా కల్తీలకు పాల్పడే వ్యాపారులకు ఇది సదావకాశంగా మారి వీలైనంత మేర దండుకుంటున్నారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న నకిలీలు కల్తీలకు సంబంధించి ప్రభుత్వ యంత్రాంగం, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. ఇప్పటికే జీవన వ్యయంలో సగ బాగం ఆసుపత్రులకు ఖర్చు అవుతున్నందున్న నేపథ్యంలో ప్రభుత్వం కూడా ఇటు నకిలీలను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నారు.

ఇంకా అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు

(మొదటిపేజీ తరువాయి)

స్వంత భవనాల్లోనే పని చేయాలని స్పష్టం చేసింది. ఫిబ్రవరి 1 నుండి ప్రైవేట్ భవనాలకు అద్దె చెల్లింపులు నిలిపివేయాలని కూడా ట్రెజరీ అధికారులకు సూచనలు ఇచ్చింది. అయితే పాలేరు నియోజకవర్గంలో అనేక కార్యాలయాలు ఇంకా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఐసీడీఎస్ తిరుమలాయపాలెం ప్రాజెక్ట్ పరిధిలోని నేలకొండపల్లి మండలంలో 2, కూసుమంచి మండలంలో 13, తిరుమలాయపాలెం మండలంలో 22 అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మొత్తం 37 కేంద్రాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు.

కూసుమంచి మండలంలో.....

కూసుమంచి మండలంలో పలు గ్రామ పంచాయితీ కార్యాలయాలు, సహకార సంఘాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు కూడా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో ప్రతి నెలా ప్రభుత్వానికి భారీగా అద్దె భారం పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటంతో పిల్లలకు సరైన సౌకర్యాలు లేవని మహిళలు,

గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోను పూర్తిగా అమలు చేసి, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

-ప్రజాపాలన కార్యక్రమంలో పరిశుభ్రత పనులు

-సర్పంచ్ రుక్మిణి

ప్రజాపక్షం/చండ్రుగొండ: చండ్రుగొండ గ్రామ పంచాయితీ పరిధిలోని పారిశుద్ధ్యంపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించిందని సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి తెలిపారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఈసందర్భంగా బస్టాండ్ పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్లను జేసీబీతో తొలగించారు. డ్రైనేజీల శుభ్రత, రోడ్ల క్లీనింగ్ వంటి పనులు కూడా నిర్వహించారు. గ్రామంలో ప్రతి వీధిలో పరిశుభ్రత పాటించాలని వ్యాధులు రాకుండా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ ప్రజలకు సూచించారు. పంచాయితీలో నీటి సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ అశోక్, ఎంపిఓ ఖాన్, మాజీ జెడ్‌పిటిసి కొణకండ్ల వెంకటరెడ్డి, టౌన్ అధ్యక్షులు తుమ్మలపల్లి సురేష్, ఉప సర్పంచ్ అంతటి రామకృష్ణ, వార్డు సభ్యులు నిమ్మగడ్డ పుష్ప, సూర వెంకటేశ్వర్లు, బుంగ శ్రీను, కిరణ్‌రెడ్డి, కడియాల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ కోమాట్లగూడెం, కేజీబీవీ సింగరేణి, జెడ్‌పిహెచ్‌ఎస్ గేటుకారేపల్లి, జెడ్‌పిఎస్ ఎస్ పేరుపల్లి, ఏహెచ్‌ఎస్ మూలపోచారం పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు చంద్రు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష పరికరాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ స్థాపకులు భూక్య వీరన్న(టీచర్, ఎంపియూపిఎస్ సూర్యతండా) విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్లు, పెన్సిళ్లు, స్కేల్‌లు, జ్యామెట్రీ బాక్స్‌లు అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు సుమారు 250 మంది విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందించినట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు భవిష్యత్తులో కూడా సహాయం అందిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో పేరుపల్లి సర్పంచ్, ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు, జాన్సీ సౌజన్య, జయరాజు, లక్ష్మీ ఆనంద్, పాఠశాల సిబ్బంది, చంద్రు ఫౌండేషన్ సభ్యులు రవి, రమేష్, భాను శ్రీ, వినోద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెలుగుమట్ల బాధితులకు పట్టాలు పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకు సంబంధించి కడపటి సమయానికి సమాచారం లేదు. విపక్షాలు ముఖ్యంగా వామపక్షాలు భూదాన్ భూముల్లోనే బాధితులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అర్హులైన 311 కుటుంబాలకు కూడా భూదాన్ భూముల్లోనే స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వనున్నట్లు సమాచారం. నిన్న మొన్నటి వరకు రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ భూముల్లో పట్టాలు ఇస్తారని ప్రచారం జరిగినప్పటికీ ప్రాథమిక సమాచారం ప్రకారం భూదాన్ భూముల్లోనే పట్టాలు ఇవ్వడానికి అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. వెలుగుమట్ల నివాసాల కూల్చివేతకు సంబంధించి ప్రభుత్వం పెద్ద ఎత్తున బదనామైంది. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరంగా జరిగిన నష్టాన్ని పూడ్చుకునేందుకు వెలుగుమట్లలోనే నిర్వాసితులకు పట్టాలు ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

విస్తృతంగా పర్యటించారు. 44వ డివిజన్లోని శ్రీనగర్ కాలనీ, గాంధీనగర్ ప్రాంతాలతో పాటు 35వ డివిజన్లోని ఇందిరా ప్రియదర్శిని కాలనీ, జ్యోతినగర్ ప్రాంతాల్లో ఆయన ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైన్ వ్యవస్థను పరిశీలించడంతో పాటు స్వయంగా డ్రైన్ పూడికను తీశారు. అదే విధంగా మేడికుంట చెరువును కూడా పరిశీలించారు. 44,39 డివిజన్ల మధ్యలో ఉన్న పెద్ద డ్రైనేజీ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన ప్రజలు కాలువలు దాటుతూ నడవాల్సిన పరిస్థితి ఉందని గమనించారు. వర్షాలు, వరదల సమయంలో నీరు నిలిచి ఇళ్లలోకి చేరుతుందని స్థానికులు తెలపడంతో సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత శాఖాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో ఆయనకు షాలువాలు కప్పి పూల దండలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరాటి ప్రసాద్, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, అన్నవరపు వెంకటేశ్వర్లు, వీశంశెట్టి పద్మజ, గొర్ల నరేష్, కొమ్మవరపు ఆదామ్, నవీన్, నామా పండు, యాకయ్య, గౌతమి కృష్ణ, కిన్నెర శ్రీను, ఆగరెడ్డి వెంకట్రెడ్డి, గూడపాటి నర్సింహారావు, నారపోగు రామయ్య, వెంకన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కవిత దీక్ష భగ్నం

(మొదటిపేజీ తరువాయి)

విశారదన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కవితను హైదరాబాద్ తీసుకెళ్లి జాగృతి కార్యాలయం వద్ద వదిలేశారు. జాగృతి కార్యాలయం వద్ద ఆమె తిరిగి నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని, భూదాన్ భూముల్లోనే వెలుగుమట్ల బాధితులకు పట్టాలు ఇచ్చి ఇండ్లు కట్టించి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. భూదాన్ భూములను ఆక్రమించుకునే హక్కు ప్రభుత్వానికి లేదని ఆమె తెలిపారు. రాజ్యాంగం పట్టుకుని నిరంతరం మాట్లాడే రాహుల్ గాంధీకి వెలుగుమట్ల బాధితుల గోడు వినిపించడం లేదా అని ఆమె ప్రశ్నించారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో మరో 30 ఎకరాలు ఆక్రమణలకు గురైందని దానిని వెలికితీసి పేదలకు పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వెలుగుమట్ల బాధితులకు ఇండ్లు నిర్మించి ఇచ్చేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని ఆమె తెలిపారు.

డాక్టర్ కాపా మురళీకృష్ణను సన్మానించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లా మెడికల్ హెల్త్ చైర్మన్‌గా నియమితులైన వైరాకు చెందిన లయన్స్ ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణను మంగళవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్, మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌లతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వృత్తి రీత్యా వైద్యులు, సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న డాక్టర్ కాపా మురళీకృష్ణను రాష్ట్ర ప్రభుత్వం డిసిసి జిల్లా మెడికల్ హెల్త్ శాఖ చైర్మన్‌గా నియమించడం అభినందనీయం అన్నారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ వైద్యరంగానికి పరిపూర్ణమైన సేవలు అందిస్తారని నమ్మకం ఉందని అన్నారు. డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ వైరా పట్టణ నివాసి డాక్టర్ కాపా మురళీకృష్ణ జిల్లాలో ప్రధానమైన శాఖకు చైర్మన్‌గా నియమితులు కావడం వైరాకు గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో స్నానాల లక్ష్మీపురం వైస్ ప్రెసిడెంట్ మల్లు రామకృష్ణ, వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుమ్మా రోశయ్య, వుంద్రు శ్యామ్‌బాబు, కట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ప్రస్తుత ఎండకాలం దష్ట్యా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ అశ్విని తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్నది వేసవి కాలం దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అవగాహన కల్పించాలని, ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండలో బయటకు వెళ్లకుండా ఉండాలని, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లవలసి వస్తే నెత్తిన టోపి కాని రుమాలు గాని ధరించాలని, మంచినీరు ఎక్కువగా తాగాలని, మజ్జిగ, కొబ్బరి నీరు లాంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని తెలిపారు. వడదెబ్బకు గురైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలని, ఓఆర్ఎస్

ప్యాకెట్లు ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సెంటర్లు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో లభిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఓ భాస్కర్‌రావు, పిహెచ్ఎన్ పద్మావతి, సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

బీసీ కౌన్సిలర్లను సన్మానించిన నారాయణవరపు

ప్రజాపక్షం/సత్తుపల్లి: ఇటీవల జరిగిన సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల నుంచి గెలుపొందిన బీసీ కౌన్సిలర్లను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. మంగళవారం వేంసూరు రోడ్డులోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం కమల్ పాషాతో పాటు కౌన్సిలర్లు విరివాడ అపర్ణ నాగభూషణం, తోట సుజలారాణి, ఉప్పు నాగమణి, నసీమా షరీఫ్, దూదిపాల రాంబాబు, మౌలాలి, బెల్లంకొండ రాము, హకీమ్, మీర్జా భాషా, బండారు ఈశ్వర్ శరత్ చంద్ర, పరసా మానస రాము లనుశాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణవరపు

శ్రీనివాస్ మాట్లాడుతూ సత్తుపల్లి మున్సిపాలిటీలో మొత్తం 23 వార్డులు ఉండగా అందులో 12 మంది బీసీ సభ్యులు ఉన్నారని తెలిపారు. సభలో బీసీ సభ్యులే మెజార్టీగా ఉన్నందున బీసీల అభ్యున్నతికి అందరూ ఏకాభిప్రాయంతో పనిచేయాలని ఆయన సూచించారు. పార్టీలు వేర్వేరుగా ఉన్నప్పటికీ బీసీల రాజ్యాధికార సాధన కోసం ఐక్యంగా ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షులు దూస్సా వెంకటేశ్వర్లు, రజక సంఘం రాష్ట్ర నాయకులు తెలగారపు అప్పారావు, రజక సంఘం సత్తుపల్లి పట్టణ అధ్యక్షులు విరివాడ నాగభూషణం, పైళ్ళ సాయి శ్రీనివాస్, కోమటి తిరుమలరావు, కందుకూరి మారేశ్వరరావు, గౌతమ్ పామర్తి నాగేశ్వరరావు గౌడ్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్‌ని కలిసిన దిద్దుపూడి గ్రామ దళితులు

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ కొణిజర్ల మండలం దిద్దుపూడి గ్రామంలో దిద్దిపూడి రెవిన్యూ పరిధిలో సర్వే నెంబర్ 81,82,83 లలో గత 70 సంవత్సరాల నుండి ఎస్సీ స్వాధీన అనుభవంలో ఉన్న పంచరాయి భూమికి సుమారు రెండు ఎకరాలకు పట్టాలు ఇప్పించమని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యని కలిసి వినతిపత్రం అందించడం జరిగింది. వివరాల్లోకి వెళితే దిద్దుపూడి గ్రామ రెవిన్యూ అదే గ్రామానికి చెందిన అమర్లపూడి భాస్కర్, అమర్లపూడి రమేష్, అమర్లపూడి తేజ, అమర్లపూడి పుల్లయ్య, అమర్లపూడి రవి, అమర్లపూడి అనిల్, అమర్లపూడి ఆనందరావు, గుజ్జర్లపూడి రామయ్య, గుజ్జర్లపూడి బాలసౌరి అనుదళితులు వారి తాతల తండ్రుల నుండి గత 70 సంవత్సరాల నుండి స్వాధీన అనుభవంలో ఉన్న పంచరాయి భూమికి కొణిజర్ల మండల అధికారులు, వైరా మున్సిపాలిటీ అధికారులు అట్టి భూమిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పేద వర్గాలైన దళితులు తండ్రుల నుండి మా స్వాధీన అనుభవంలో ఉంటూ పశువులు మేపుకుంటూ మేము అనుభవిస్తున్నటువంటి భూమికి పట్టాలు ఇప్పించమని గత అనేక సంవత్సరాలుగా రెవిన్యూ అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ పట్టాలు ఇవ్వకపోగా మా నుండి బలవంతంగా గుంజుకొని ప్రభుత్వ అవసరాలకు వాడుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు అని ఆరోపిస్తూ

గతంలో కొణిజర్ల మండల తహశీల్దార్‌ని ఖమ్మం జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతిపత్రాలు ఇప్పించినప్పటికీ అవే ప్రయత్నాలు కొనసాగుతున్నందున తప్పని పరిస్థితుల్లో హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ భక్తి వెంకటయ్య, ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాబు నాయక్‌లకు కలిసి వినతిపత్రం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ అంజి నాయక్, అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తినాయక్, సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి కొణిజర్ల మాజీ జెడ్పిటిసి యర్రా బాబు, వైరా సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, దుద్దెపూడి మాజీ సర్పంచ్ మాచర్ల నాగభూషణం, బాధితులతో కలిసి వినతిపత్రం అందించారు.

కలుషిత ఆహార ఘటనలు పునరావృతం కారాదు

విద్యార్థుల ఆరోగ్యాల పట్ల శ్రద్ధ తీసుకోవాలి
అధికారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదు
ఐటిడిఏ పిఓతో కలిసి కలెక్టర్ అంకిత్

ప్రజాపక్షం/భద్రాచలం : విద్యాసంస్థలు, వసతి గృహాల్లో ఆహార కలుషిత ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్‌తో కలిసి ఆయన మంగళవారం జిల్లాలోని అధికారులతో టెలీకాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పూర్తి బాధ్యత ఆర్సిఓలు, మండల ప్రత్యేకాధికారులదే అన్నారు. కలుషిత ఆహార ఘటనలపై కేవలం వంటవారు వార్డెన్లపై చర్యలు తీసుకోవడం సరిపోదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల మణుగూరు మహాత్మాగాంధీ జ్యోతిపూలే గురుకుల బాలికల పాఠశాలలో జరిగన కలుషిత ఆహారఘటన దురదృష్ట కరమని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం కొందరు విద్యా

ర్థినీల తల్లిదండ్రులు ఇంటి నుండి తీసుకొచ్చిన బిర్యాని, మాంసాహారాలు భుజించడం వల్ల అస్వస్థతకు గురైనట్లు వెల్లడైందని, ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఆహార భద్రతా కమిటీ సభ్యులు ముందుగా వండిన ఆహారాన్ని స్వయంగా రుచి చూసి తర్వాత మాత్రమే విద్యార్థులకు వడ్డించాలన్నారు. జిల్లా, మండల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని విద్యా సంస్థలు, వసతి గృహాలను తరుచూ సందర్శిస్తూ ఆహార నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ అంశాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించేదిలేదని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఉమారాణికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్

ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని సిద్దారం రోడ్‌లో నివాసముంటున్న బోయినపల్లి రవి సతీమణి ఉమారాణి సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మంగళవారం వారి నివాసానికి చేరుకుని ఉమారాణి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ఆమె ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, కౌన్సిలర్ తోట సుజలా రాణి, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు సాధించిన సాయిస్ఫూర్తి విద్యార్థులు

ప్రజాపక్షం/సత్తుపల్లి: సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించారు. మండల పరిధిలోని గంగారంలో సాయిస్ఫూర్తి ఆటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో విద్యార్థులు సత్తా చాటారు. చెన్నైకి చెందిన నోవహమో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో మొత్తం 17 మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఎంపికయ్యారు. కళాశాల నుంచి 66 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, ఆన్‌లైన్ రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్, హెచ్ఆర్ రౌండ్, మౌఖిక ఇంటర్వ్యూ ప్రక్రియల ద్వారా 17 మందిని ఎంపిక చేసినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఎంపికైన వారిలో సిఎస్ఈ నుంచి 6 మంది, సిఎస్ఎం నుంచి 5 మంది, ఏఐ అండ్ డిఎస్ నుంచి 4 మంది, ఈసీఈ నుంచి ఇద్దరున్నారు. ఎంపికైన విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తయ్యిన అనంతరం చెన్నైలో ఉద్యోగంలో చేరనున్నారని, వారికి సంవత్సరానికి రూ.3.4 లక్షల వేతనం అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్టు పరిజ్ఞానంతో పాటు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, ట్రైనింగ్ , ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ వి. కృష్ణారెడ్డి, విభాగాధిపతులు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి వేడుకలు

ప్రజాపక్షం/సత్తుపల్లి: సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సామాజిక సంస్కర్త, మహిళా విద్యకు పునాది వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి వేడుకలు స్థానిక సత్తుపల్లి యుటిఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళా విద్య కోసం పోరాడిన తొలి గురువుగా సావిత్రిబాయి పూలే చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. అణగారిన వర్గాలు, మహిళలకు విద్య అందించేందుకు ఆమె చేసిన కృషి సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. సమానత్వం, మహిళా సాధికారత కోసం యువత ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్, మహిళా సంఘం నాయకులు చెరుకు రత్నకుమారి, తన్నీరు కృష్ణవేణి, మండల కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై నిరసన

ప్రజాపక్షం/కూసుమంచి: టిఎస్‌యూటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కూసుమంచి మండల కమిటీ ఆధ్వర్యంలో కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ)ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేజీబీవీ కూసుమంచి, ఎంఆర్‌సి కూసుమంచి కేంద్రాల్లో ఉద్యోగులు నల్ల రిబ్బన్స్ ధరించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రశాంతి మాట్లాడుతూ కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే విద్యాశాఖలో విలీనం చేసి పే స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తక్కువ వేతనాలతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎంఎస్ కోఆర్డినేటర్ మధు, సిసిఓ తులసి, ఐఏఆర్సి కళ్యాణి, వడ్లమూడి వెంకటేశ్వర్లు, జాఫర్, మైసయ్య, ఉపేందర్, కేజీబీవీ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

తల్లాడ ఎంపీవో ఏనుగు సురేష్ బాబు

ప్రజాపక్షం/చింతకాని: విద్యార్థులు పట్టుదలతో చదివి పదవతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని తల్లాడ మండల పంచాయతీ అధికారి ఏనుగు సురేష్ బాబు విద్యార్థులకు సూచించారు. సన్ రైజ్ అభ్యుదయ సేవా సమితి వైరా వారి ఆధ్వర్యంలో నేరడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం పరిక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో సురేష్ బాబు మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా ఇప్పటి వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, గురువులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్ బాబు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతి దాస్, ప్రతినిధులు ఏనుగు కిరణ్ బాబు, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం కథనానికి స్పందన

- అక్రమ ఇసుక తవ్వకాలను పరిశీలించిన సర్పంచ్, జీపీఓ

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలంలోని కస్నాతండగ్రామంలోని ఆకేరులో జరగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై ప్రజాపక్షం ప్రచురించిన కథనంపై జీపీఓ కవిత స్పందించారు. ఆ ఊరి సర్పంచ్ బానోత్ పాపతో కలిసి వెళ్లి తవ్వకాలు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడితే చట్టరిత్య చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కావున ఆకేరులో ఎటువంటి ఇసుక తవ్వకాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

సేవ భావాన్ని చాటుకున్న కాంగ్రెస్ నాయకుడు తేజావత్ పంతుల్ నాయక్

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : మండలంలోని గోళ్లపాడుపోలేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు కాంగ్రెస్ నాయకుడు, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ తేజావత్ పంతుల్‌నాయక్ పరీక్షా సామాగ్రిని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి, తల్లి దండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ పరీక్షలలో మంచి ప్రతిభను కనబరిచే విద్యార్థులకు భవిష్యత్తులో అవసరమైనప్పుడు సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎప్పుడు ముందుటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి సర్పంచ్ బత్తిని మహేష్, గోళ్లపాడు సర్పంచ్ గుండు శ్రావణిశ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగా వెంకట్‌రావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మద్ది వీరారెడ్డి, సింగిరెడ్డి బోస్ రెడ్డి, కొండం ప్రభాకర్‌రావు, తాళ్లపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ప్రియదర్శిని విద్యార్థినుల సత్తా

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీ 6వ వార్డులోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్‌లో మంచి ప్రతిభ కనబరచి ఉద్యోగాలను మంగళవారం సాధించారు. బెంగళూరులోని వి స్టాండ్ 4యూ సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లుగా ఎంపికైన వీరికి సంవత్సరానికి రూ.5లక్షల వేతనంతో ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ సందర్భంగా కళాశాలలో చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు విద్యార్థినిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా గ్రామాన్ని పూర్తిగా అభివృద్ధి చేసి ప్రతి వ్యక్తికి సౌకర్యాలు అందించడం నా లక్ష్యం అని గూడూరుపాడు సర్పంచ్ పుచ్చకాయల శ్రీదేవి కమలాకర్ అన్నారు. మౌలిక వసతులు, విద్య ఆరోగ్యం, తాగునీరు వంటి రంగాల్లో ప్రత్యేక దృష్టి పెట్టే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో పేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇప్పించే బాధ్యత తనదేనన్నారు. ఈ మేరకు ప్రజాపక్షం ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను పంచుకున్నారు. -ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :

మంత్రి పొంగులేటి సహకారంతో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు..

గ్రామ అభివృద్ధే.. నా లక్ష్యం

ప్రజాపక్షం ప్రత్యేక ఇంటర్వ్యూలో సిపిఐ సర్పంచ్ పుచ్చకాయల శ్రీదేవి కమలాకర్.

ప్రశ్న : మీ గ్రామ అభివృద్ధికి ముఖ్య ప్రాధాన్యం ఏమిటి?

సమాధానం : గ్రామంలో ఇప్పటికే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిగారి కృషితో గూడూరుపాడు గ్రామానికి ప్రధానమైనటువంటి బైపాస్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. 80శాతం మేరకు సీసీరోడ్లు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని పరిష్కారం చేస్తాను.

ప్రశ్న : మీ గ్రామ అభివృద్ధికి ముఖ్య ప్రాధాన్యం ఏమిటి?

సమాధానం : రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రం, యువకులకు క్రీడా మైదానం ఏర్పాటుతో పాటు బీసీ కాలనీలో తాగునీటి కోసం 60లీటర్ల వాటర్‌ట్యాంక్ నిర్మాణం. నూతన గ్రామపంచాయతీ కార్యాలయం భవన నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించుటకు కృషి చేస్తాను.

ప్రశ్న : ప్రస్తుతం గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలు ఏమిటి?

సమాధానం : యుపిహెచ్ ప్రభుత్వ పాఠశాలలో 50మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు కొరత ఉన్నది. అంగన్వాడీ బిల్డింగ్ పాత బడి ప్రమాదకరగా ఉంది. ఆరోగ్యం విషయంలో వైద్య సదుపాయాలు అంతంత మాత్రమే అందుతున్నాయి. ఇక్కడ రెండు వేల మందికి పైగా జనాభా కలిగి హెల్త్ సెంటర్ ఉన్నప్పటికీ, ఏఎన్ఎం, ఆరోగ్య కార్యకర్త తప్ప డాక్టర్ లేక హెల్త్ సర్వీస్ అందడం లేదు. అంతేకాకుండా 10పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కోతుల బెడద కూడా విపరీతంగా ఉంది. దీనిపై తొలి సమావేశంలోనే తీర్మానం చేసి కలెక్టర్‌గారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా తమ పుచ్చకాయల వెంకటేశ్వర్లుశ్రీనివాస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలంటరీ టీచర్‌ను పెట్టి గౌరవ వేతనం ఇస్తున్నాము

ప్రశ్న : తాగునీరు. రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఏ చర్యలు తీసుకుంటున్నారు?

సమాధానం : పాడైన పాత బోర్లను రిపేర్ చేయించి, వాటి ద్వారా నీటి సమస్యను పరిష్కారంచే దిశగా ప్రణాళిక చేస్తున్నాం. అంతేకాకుండా చెరువు దగ్గర కట్ట కింద బావి పైపులు మరమ్మత్తులు చేపిస్తున్నాము. గొర్రెలు, మేకలు, గేదెలు,ఆవులు, మూగజీవాల తాగునీటి కొరకు నీటి స్టోరేజ్ పాయింట్ ఏర్పాటుకు కృషి చేస్తాను. రోడ్లు డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి పెట్టాము

ప్రశ్న : యువత, మహిళలు అభివృద్ధికి ఏ కార్యక్రమాలు చేస్తున్నారు

సమాధానం : యువత, మహిళల అభివృద్ధి కోసం గ్రామంలో ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలనుకుంటున్నాను

ప్రశ్న : చెరువులు పర్యావరణ కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారు?

సమాధనం : ఇక్కడి గూడూరు కుంట, అన్నం కుంట చెరువు ప్రైవేట్ వ్యక్తి పేరు మీద ఉంది. అధికారులు దృష్టికి తీసుకువెళ్లి అతని పేరు పైనుంచి తొలగింపు చేపిస్తాను. అలాగే పిట్టలవారిగూడెం దామచెరువు ఆక్రమణకు గురవుతున్నది. కాపాడే ప్రయత్నం చేసి. చెరువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాను. పర్యావరణంపరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాము

ప్రశ్న : ప్రజల సహకారం ఎలా ఉంది?

సమాధానం : ప్రజల నుంచి చాల మంచి సహకారం ఉంది. మా కుటుంబంపై వారికి ఉన్న నమ్మకాన్ని నిలబెడతానన్న సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజలందరినీ మరింత సంఘటితం చేస్తూ ఊరు రూపు రేఖలను మారుస్తాను

ప్రశ్న: ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?

సమాధానం : ఊరిలో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. ఎవరికైన రేషన్‌కార్డు లేకుంటే ఇప్పిస్తాను. మంత్రిగారి సహకారంతో ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకు ఇప్పించే బాధ్యత నాదే

ప్రశ్న : చివరగా ఏమైనా చెప్పాలనుకుంటున్నారా?

సమాధానం : నా గెలుపులో సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత కృషి వెలకట్టలేనిది. అలాగే మహిళలు చూపిన ఆధార అభిమానాలు మరువలేనివి. ప్రధానంగా నా భర్త వెన్నంటే ఉంటూ ఇచ్చిన ప్రోత్సాహం నా అదృష్టం. ఈ అవకాశం ప్రజసేవకే అంకితం చేస్తాను.

నిరసన వ్యక్తం చేసిన ఉపాధ్యాయ ఉద్యోగులు

ప్రజాపక్షం/పెనుబల్లి: టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేజీబీవీ, యుఆర్ఎస్, ఎస్ఎస్ఏ ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం భోజన విరామ సమయంలో కే.జీ.బీ.వీ.ఉప్పలచలక, సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎం.ఆర్.సి నందు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులను తక్షణమే విద్యాశాఖలో విలీనం చేసి అప్పటి ప్రభుత్వ పే స్కేలును అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం చాలీచాలని వేతనాలతో కాలం వెళ్ళదీస్తూ బ్రతుకు జీవుడుగా ఉద్యోగం చేస్తున్నామని, కుటుంబ పోషణ కూడా కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ స్థిరమైన వేతనం, భద్రత లేకుండా పని చేయటం చాలా బాధాకరమని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం కొంత కనికరంతో స్పందించి కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలని, వారికి సమాన పనికి సమాన వేతనంలో భాగంగా బేసిక్ పే వర్తింపజేయాలని, వాళ్ల సర్వీసుకు రక్షణ కల్పిస్తూ, రెగ్యులర్ చేయాలని, హెల్త్ కార్డులు వర్తింప జేయాలని, 29 రోజులపాటు చేసిన సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని, కేర్ నియమించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలం నాయకులు జి. హనుమంతు, ఎస్. పుల్లారావు, టి. రమేష్, కేజీబీవీ ఎస్ఓ వెంకట రమణ , ఎన్. అరుణ,ఎంఐఎస్ బి. రమేష్, సీసీఓ పి. ప్రకాష్, సీఆర్పీ లు హుస్సేన్, గోపి మొదలగువారు పాల్గొన్నారు.

పరిశుభ్రవార్డుగా 28 ని నిలుపుతా

సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు

ప్రజాపక్షం/ఖమ్మం రూరల్: ఏదులాపురం మున్సిపాలిటీలోనే పరిశుభ్రవార్డుగా 28 ని నిలబెడతానని సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు అన్నారు. ప్రజా పాల-ప్రగతి ప్రణాళిక లో భాగంగా కార్మికులు చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి చెత్త నిర్వహణ, డ్రైనేజీ శుభ్రత, వీధుల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ జవాన్ హుసేన్, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ముస్తాబు

- అందంగా మారుతున్న రామాయణ బొమ్మలు
- ఏర్పాట్లు శరవేగం
- 27న రామవనవి, 28న పట్టాభిషేకం



ప్రజాపక్షం/భద్రాచలం : దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న శ్రీ సీతా రామ చంద్ర స్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇందు కోసం రామాలయ పరిసర ప్రాంతాలతో పాటు, గాలిగోపురం, చుట్టు ప్రకారాలు, గోదావరి కరకట్ట ప్రాంతాలు ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా మిథిలా స్టేడయంలో పనులు ఊపందుకున్నాయి. గోదావరి కరకట్టపై ఏర్పాటు చేసిన రామాయణ ఇతి వృత్తాల (రామాయణ కథలోని ప్రధాన ఘట్టాలు) బొమ్మలను అందంగా తీర్చి దిద్దుతున్నారు. వాటికి చక్కటి రంగులు అద్ది, ఆ బొమ్మ దేనికి సంబంధించిన సందేశాన్ని తెలుపుతుందో అక్కడ రాసి ఉంచారు. ఇది రామభక్తులతో పాటు చూపరులను మరింతగా ఆకట్టుకుంటోంది.

ఏర్పాట్లు శరవేగం : రాముల వారి పెళ్లికి సంబంధించిన పనులు చకచకా సాగుతున్నాయి. చలువ పందిళ్లు ఏర్పాట్లు మొదలయ్యాయి. గోదావరి తీరంలో భక్తులు సేదతీరేందుకు ఏర్పాట్లు చేసే చర్యలు చేపట్టారు. వివిఐపి, విఐపితో పాటు భక్తులకు సెక్టార్ల పనులు దాదాపుగా మార్కింగ్ అయ్యాయి. ఇందులో భాగంగా పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఇప్పటికే మంత్రి పొంగులేటి, కలెక్టర్ అంకిత్‌లు ఆదేశించంగా అధికారులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. మరో ప్రక్క స్వాగత ద్వారాలకు సంబంధించిన పనులు మొదలుపెట్టారు. తెలుగు రాష్ట్రాల నుండే కాక పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తున్నారు.

19 నుండి : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 19 నుండి వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమి తిరుకళ్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆ నాటి నుండి ఆలయంలో నిత్యకళ్యాణాలను రద్దు చేస్తారు. ఇదిలా ఉండగా 27న రామవవమి, 28న పట్టాభిషేక మహోత్సవాలు జరుగనున్నాయి. తలంబ్రాల తయారీ కొనసాగుతోంది. మొత్తంగా 400 క్వింటాళ్ల తలంబ్రాలు అవసరం కానున్నాయనే అంచనాలతో సిద్ధం చేస్తున్నారు.

ఎస్‌బిఐటిలో ఏఐ వర్క్ షాప్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : విద్యా, ఉపాధి రంగాలలో ఏఐ ద్వారా శిక్షణ పొందే విధానాలపై ఎస్‌బిఐటి కళాశాలలో ఐదు రోజుల పాటు ఏఐ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ఏఐ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండాల కృష్ణ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగం ఉద్యోగానికి సిద్దమవుతున్న విద్యార్థులు స్మార్ట్ వే లో అభ్యసించాలని తెలిపారు. టెక్నికల్ స్కిల్స్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్ పెంపొందించుకోవడానికి కృత్రిమ మేథ ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన కెఎల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రో॥ డా॥ సయ్యద్ కరీమున్నీసా మాట్లాడుతూ శిక్షణకు సంబంధించి ఎప్పుడైనా, ఎక్కడైనా నేర్చుకునే సౌలభ్యం ఆన్‌లైన్ ప్లాట్‌పామ్స్ ద్వారా కలుగుతుందన్నారు. కృత్రిమ మేథాను ఈ ఆన్‌లైన్ ప్లాట్‌పామ్స్‌లో అనుసంథానించడం ద్వారా క్రిటికల్ థింకింగ్, అతి క్లిష్టమైన ప్రశ్నలకు పరిష్కారం, డిబగ్గింగ్, అప్టిమైజ్డ్ సొల్యూషన్స్ అందిస్తుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ ఏఐతో శిక్షణ అందించడంతో చాట్ జిపిటి, గిట్ హబ్, కో పైలెట్ వంటి టూల్స్‌ను ఉపయోగించవచ్చునని ఆమె తెలిపారు. కోడింగ్‌కు ప్రత్యేకించి లీట్ కోడ్, హ్యాకర్ ర్యాంక్, కోడ్ చెఫ్ వంటి సాధనాలను వినియోగించుకోవాలని కళాశాల హెచ్‌ఎం కె. శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఏఐ అనుసంథానమైన కోడింగ్ పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు గుర్తింపు, సర్టిఫికెట్స్, బ్యాడ్జెస్ వంటి సాధించగలరని విద్యార్థుల ప్రతిభ ఆన్‌లైన్‌లో వివిధ కంపెనీల వారికి అందుబాటులో ఉంటుందని తద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ముఖ్య అతిథి సయ్యద్ కరీమున్నీసాను సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, సిఎస్ఈ విభాగాధిపతి డా॥ సుప్రియమీనన్, ఎఐఎంఎల్ విభాగాధిపతి డా॥ కె. స్ఫూర్తి, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సోలార్ పథకంలో అదనపు ఖర్చుల భారం..!

- ప్రశ్నించిన ఎస్సీ కుటుంబంపై కాంట్రాక్టర్, గుమాస్తా దురుసుధోరణి
- గ్రామంలో మరికొన్ని ఇళ్లల్లో కూడా ఇదే పరిస్థితి

ప్రజాపక్షం/ బోనకల్ : పేదలకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం అమలులో కొన్ని చోట్ల కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, దురుసు ధోరణి సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో జరిగిన ఘటన పథకం అమలుపై తీవ్ర విమర్శలకు దారి తీసింది. గ్రామానికి చెందిన ఒక ఎస్సీ కుటుంబం ఇంటిపై సోలార్ ప్యానెల్‌ను అమర్చినా పూర్తిస్థాయి కనెక్షన్ ఇవ్వకుండా అలాగే వదిలేయడంతో అవి నిరుపయోగంగా మారినట్లు బాధితులు తెలిపారు. ఫిట్టింగ్ పనులకు వచ్చిన కాంట్రాక్టర్ గుమాస్తా పైపులు, వైర్లు సరిపోవడం లేదని పేర్కొంటూ మీరు తెచ్చుకుంటేనే మేము కనెక్షన్ ఇస్తాం లేకపోతే పని పూర్తి కాదు అంటూ చెప్పినట్లు బాధిత కుటుంబం తెలిపింది. ప్రభుత్వ పథకం కింద పూర్తిగా అమలు చేయాల్సిన పనులకు ఇంటి యజమానిని అదనపు సామాగ్రి కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. దీనిపై ప్రశ్నించినందుకు గుమస్తా మరింత దురుసుగా ప్రవర్తిస్తూ ఏం చేసుకుంటావో చేసుకో ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలోని మరి కొన్ని ఇళ్లల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. కొన్ని చోట్ల పనులు పూర్తి చేయకుండా మిగిలిన పైపులు, ఇతర సామాగ్రిని తీసుకెళ్లి వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వం మంచి ఉద్దేశ్యంతో అమలు చేస్తున్న సోలార్ పథకం గ్రామస్తులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడకపోతుందనే ఆవేదన వ్యక్తమవుతోంది. కొంతమంది కాంట్రాక్టర్లు అధికార పార్టీలకు అండగా నిలుస్తూ తమ ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. ప్రజలు ప్రశ్నిస్తే వారిపై బెదిరింపులకు దిగడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొందరు కాంట్రాక్టర్లు తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అలాగే సోలార్ పథకం అమలులో పారదర్శకత తీసుకువచ్చి ప్రతి ఇంటికి పూర్తిస్థాయిలో సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

సింగరేణి జీఎంను కలిసిన కౌన్సిలర్ ఉప్పు నాగమణి

ప్రజాపక్షం/సత్తుపల్లి : సత్తుపల్లి మున్సిపాలిటీ 13వ వార్డ్ కౌన్సిలర్ ఉప్పు నాగమణి హనుమంతరావు సత్తుపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ ఆదేశాల మేరకు ఈ భేటీ జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ముఖ్యంగా 13వ వార్డు పరిధిలోని సింగరేణి కాలనీ, కొమ్మేపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. దీనికి స్పందించిన జీఎం చింతల శ్రీనివాస్ కాలనీ అభివృద్ధి పనులకు సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు తీగల క్రాంతి కుమార్, పోగుల నాగేశ్వరరావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కొమ్మేపల్లి షేక్ ఖలీల్, షేక్ బాజీ, పఠాన్, యూసుఫ్ ఖాన్, పెంద్ర బాపయ్య, గుంజ లక్ష్మణరావు, చల్లా వెంకటేశ్వరరావు, రహీం, గుర్రాల చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పేదప్రజల పక్షపాతి నారాయణ

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు

ప్రజాపక్షం/చింతకాని : పేదప్రజల హక్కుల కోసం పోరాడిన పంది నారాయణ చిరస్మరణియుడని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు పేర్కొన్నారు.నాగిలిగొండ గ్రామంలో మంగళవారం కామ్రేడ్ పంది నారాయణ 38వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రవీంద్రబాబు మాట్లాడుతూ ఆనాటి భూస్వామ్య గుండాల చేతిలో హతమైన అమరజీవి నారాయణ తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో కమ్యునిస్టు గా మారి గ్రామంలో కూలి రేట్ల పెంపు కోసం, అనేక భూపోరాటాలు నిర్వహించి జైలు జీవితం గడిపారన్నారు. పేద ప్రజలకు భూపంపిణీ, ఇండ్లు , ఇండ్ల స్థలాల కోసం పోరాటాలను నిర్వహించిన నారాయణను భూస్వామ్య గూండాలు దారుణంగా హత్యచేసారన్నారు. ఆయన మరణం నాగిలిగొండ పరిసర గ్రామల్లో ఒక చైతన్యాన్ని తీసుకువచ్చిందన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడి చేసే పోరాటాలే నారాయణ కు మనమిచ్చే నిజమైన ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు , నాయకులు పదిమల వెంకటనర్సయ్య, శాఖ కార్యదర్శి చాట్ల రమేష్, బాబు, పంది నాగేశ్వరరావు, శేఖర్, అరికొట్ల భాస్కర్, సుధాకర్, షేక్ హుస్సేన్, ఫిలిఫ్ తదితరులు పాల్గొన్నారు.

యుపిహెచ్‌సికి బల్లలు వితరణ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరం 18వ డివిజన్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బల్లలను వితరణ చేశారు. మంగళవారం స్థానిక కార్పొరేటర్ లక్ష్మి మనోహర్ ఆధ్వర్యంలో రూ. 54వేలు విలువ చేసే ఇనుప బల్లలు, కుర్చీలను విరాళంగా అందించారు. ఆసుపత్రికి వచ్చే వారు కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని వీటిని సమకూర్చినట్లు కార్పొరేటర్ లక్ష్మి మనోహర్ తెలిపారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, కార్పొరేటర్ కమర్తపు మురళి, తుపాకుల శ్రీనివాస్, డా॥ రమేష్‌బాబు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. మంగళవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. తొలుత ఈవిఎం గోడౌన్ సీల్‌ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి ఈవిఎం, వివి ప్యాట్ గది లోపల పరిశీలించి మరల సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సెఫ్టీ పరికరాలను పరిశీలించారు. సిసి కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు. ఎన్నికల సామగ్రి, భద్రత అత్యంత ముఖ్యమని సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎంఏ రాజు, ఆర్అండ్‌బి డిఈ లకన్ నాయక్, ఏఈ లలిత, ఎన్నికల డిటి అన్సారీ, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఇందిరమ్మ కాలనీలో క్లీన్ అండ్ గ్రీన్
వైరా మున్సిపల్ వైస్‌చైర్మన్ కట్ల సంతోష్

ప్రజాపక్షం/వైరా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక 9వ వార్డు నందు క్లీనర్ గ్రీన్‌లో భాగంగా ఇందిరమ్మ కాలనీలో మురికి కాల్వలను తీపించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి కాలనీవాసులు చుట్టుప్రక్కలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ కాలనీలో ప్రాథమిక పాఠశాల సందర్శించి పిల్లల హాజరు పట్టికను పరిశీలించి విద్యార్థులకు పరీక్షల్లో వచ్చిన మార్కుల పరీక్ష పేపర్లను పరీక్షించారు. శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ ఇందిరమ్మ కాలనీవాసులపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ఇందిరమ్మ కాలనీ ప్రక్కనున్న వాగు వర్షాలు వచ్చి పొంగినప్పుడు ఇళ్లలోకి వరదనీరు రాకుండా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కృషితో రిటర్నింగ్ వాల్ కొరకు దాదాపు రూ.6కోట్లు నిధులు మంజూరు కృషి చేస్తున్నారని తెలియజేశారు. అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు ఈ 99 రోజుల ప్రణాళిక విజయవంతం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ నయాకులు ముదిగొండ మహేష్, మామిడాల నవీన్, కొక్కిరేణి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

-మేయర్ పునుకొల్లు నీరజ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : యువత నైపుణ్యాలను మెరుగుపర్చుకుని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఖమ్మం కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక పేరుతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం ఖమ్మం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో రెండు వారాల స్కిల్స్ డెవలప్‌మెంట్ కోర్సును మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల ద్వారా యువత తమ ప్రతిభను పెంపొందించుకుని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిద్ధం కావచ్చునని తెలిపారు. ఖమ్మం ప్రాంతంలో స్థానిక పరిశ్రమలతో సమన్వయం చేస్తూ ఈ శిక్షణ పూర్తి చేసిన యువతకు ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని తమ కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటునందించి సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఇటువంటి కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అనూజ్, ఖండల్వాల్, గోపాలరావు, జిల్లా ఉపాధి అధికారి మాధవి, శివయ్య, చింతల ఉపేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు శిక్షణా తరగతులు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్టిసి) ఖమ్మం డిపోలో అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. మంగళవారం ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. డ్రైవర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపడం తీవ్రమైన నేరమని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రయాణికులు కోరినచోట ఎక్కించుకోవడం, దింపడం ద్వారా సంస్థకు మంచి పేరు తీసుకు రావాలని, ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్య స్థానాలకు చేరేవిధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని డ్రైవర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ రామారావు, గౌతమి, డిపో ఎంఎఫ్ ప్రవీణ్, డిఐ అంజయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు కంప్యూటర్ విరాళం



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి జూనియర్ కళాశాల శ్రేయోభిలాషులు పర్సా పట్టాభి రామారావు, విజయలక్ష్మి దంపతులు మంగళవారం కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా విజయలక్ష్మి తల్లి పేరుతో నడుస్తున్న మల్లాది సుబ్బమ్మ ట్రస్ట్ తరపున మల్లాది కార్తీక్ రూ 20వేల విలువైన కంప్యూటర్‌ను విద్యార్థుల శ్రేయస్సు కోసం విరాళంగా అందజేశారు. కంప్యూటర్ అందించిన దాతలకు కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విరాళం విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాపక్షం/ మధిర : 202627 విద్యా సంవత్సరం అడ్మిషన్ల ప్రకియలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధిర వారి ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం కరపత్రాలు పంపిణీ చేయటం జరిగింది. ఉజ్వలమైన భవిష్యత్‌కు ఆనందకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేసేందుకు ప్రభుత్వ డిగ్రీకళాశాల మధిర నందే చేరాలని, తమ కోర్సులు పూర్తయిన తర్వాత డిగ్రీ కోర్సులను ఎంచుకోవాలని తెలుపుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఇంటర్మీడియేట్ విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష సెంటర్ల నందు కలిసి కరపత్రాలను పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యను అందించటం జరుగుతుందని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ తప్పని సరిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. కళాశాల నందు బిఎ, బికాం, బిఎస్సీ, జనరల్, కంప్యూటర్ కోర్సులు ఉన్నాయని, వర్చువల్, డిజిటల్ తరగతి గదులు, నైపుణ్యత కలిగిన అధ్యాపకులు, గ్రంథాలయం ఇతర వనరులనుఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దోస్త్ కో ఆర్డినేటర్ ఎస్.ఇందర, అధ్యాపకులు పి.శ్రీనివాసరావు, కె.రాకృష్ణ, వి.నాగరాజు, కె.వెంకటేష్, పి.లక్ష్మి నారాయణ, షేక్.ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పురోహితులకు పంచాంగాల బహూకరణ

ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి, కామేపల్లి, గార్ల, రఘునాథపాలెం మండలాలకు చెందిన పురోహితులకు సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి పంచాంగాలను బహూకరించారు. మంగళవారం కారేపల్లి శివాలయంలో జరిగిన కార్యక్రమంలో విజయ విఘ్నేశ్వర అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు కొత్తలంక కైలాస్ శర్మకు పంచాంగాలను అందజేశారు. ఈసందర్భంగా కైలాస్ శర్మ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా పురోహితులకు పంచాంగాలు అందజేస్తున్న సురేందర్ రెడ్డి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పురోహిత సంఘం ఉపాధ్యక్షులు వెలవలపల్లి వెంకట సురేష్ శర్మ, కోశాధికారి కొండపల్లి శ్రీనివాస్ వర్మ, తుంగతుర్తి రామకృష్ణ శర్మ, రామరాజు ఉదయ్ కుమార్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పరిశ సీతారత్నం ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాపక్షం/చింతకాని: ఖమ్మం జిల్లాలో పరిశ సీతారత్నం ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలు అభినందనీయమని నేరడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల శ్రీనివాసరావు పేర్కొన్నారు.బుధవారం నేరడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరిక్షా సామాగ్రిని పరిశ సీతారత్నం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా విద్యారంగంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు మరువలేనివని, ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు సైతం ట్రస్ట్ చేయూత నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మందడపు రామనరిసింహారావు, భాగ్య, ఏ లక్ష్మ య్య, ఎస్ ఎస్ రామరాజు, కె లక్ష్మీ , టి చంద్రశేఖర్ ఏ నాగమణి, కిరణ్‌కుమార్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారికి అన్నప్రాసన

ప్రజాపక్షం/చింతకాని: గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్దిదారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాఘవాపురం ఉపసర్పంచ్ అబ్బూరి మహేష్ అన్నారు. మంగళవారం రాఘవాపురం అంగన్‌వాడీ సెంటర్‌లో కనపర్తి సత్యనారాయణ మౌనిక దంపతుల కుమారుడు సాత్విక్ కు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బూరి మహేష్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లల పెంపకం , ఆరోగ్యం, పరిశుభ్రత, బాల్యవివాహాల నిర్మూలనలపై అవగాహన కల్పించాలన్నారు.అనంతరం చిన్నారి మేకల విష్ణుప్రియకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, ఉపాధ్యాయులు చెన్నకేశవరెడ్డి, వార్డు సభ్యులు నర్సింహారావు, రమేష్, అంగన్వాడీ కార్యకర్త కనకమ్మ, ధనలక్ష్మీ , సుజాత, బేబి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధికారులు సహకరించటం లేదని ఫిర్యాదు

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని బిఆర్ఎస్ సర్పంచ్‌ల గ్రామాల్లో అభివృద్ధికి అధికారులు సహకరించటంలేదంటూ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం, నర్సింహాపురం, రాజుపాలెం, రామాపురం, గుంటుపల్లిగోపవరం గ్రామాల్లో ఎన్ఆర్ఇజిఎస్‌కి సంబంధించిన సిసి రోడ్లకు నిధులు మంజూరయ్యాయని, గ్రామాల్లో సిసి రోడ్లు వేసేందుకు సంబంధిత డిఇ, ఎఇను సంప్రదించామని, అభివృద్ధి పనులకు అధికారులు సహకరించటంలేదని, పనులను ఆపాలని చెబుతున్నారని, ఫోన్ చేసిన మాకు తగిన సమాధానం ఇవ్వటం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని సర్పంచ్‌లు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఇనపనూరి లాలయ్య, శీలం రామకోటేశ్వరరావు, గిరజాల మరియమ్మ, కోల్లు లక్ష్మీ , వేల్పుల బెంజిమెన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

ప్రజాపక్షం/ బోనకల్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ, ఎన్‌హెచ్ఎం డిపిఓ దుర్గ, హెచ్ఇఓ సత్యనారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని, స్క్రీనింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. డ్రగ్ స్టాక్ పోసిషన్ ఎప్పటికప్పుడూ చేసుకుంటూ అవసరమైన ఇండెంట్ పెట్టుకుని అందరికీ సకాలంలో మందులు అందేలా చూసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్‌ను ఆహ్వానించి ఘనంగా సన్మానించటం జరిగింది. అదేవిధంగా పిహెచ్‌సి సిబ్బంది నుండి ఉత్తమ సేవలు అందించిన వారిని కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌విలు ఉదయ్, అనూష, రమాదేవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార విషబాధ ఘటనపై సమీక్ష నిర్వహించిన డిఎం అండ్ హెచ్ఓ

ప్రజాపక్షం/మణుగూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిఎం అండ్ హెచ్ఓ) మంగళవారం మణుగూరు ఏరియా ఆసుపత్రిని సందర్శించి, మణుగూరు ఎంజేపిటిసి బిసి హాస్టల్‌లో జరిగిన ఆహార విషబాధ ఘటనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 17 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం అందింది. వారిలో 16 మంది విద్యార్థులను మణుగూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. ఒక విద్యార్థికి ప్రాథమిక చికిత్స అందించి తిరిగి హాస్టల్‌కు పంపించారు. మిగతా విద్యార్థులు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ స్థిరంగా ఉన్నారు. వారిని ఏరియా ఆసుపత్రి బాల వైద్య నిపుణుడు పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. సందర్శన సందర్భంగా డిఎం అండ్ హెచ్ఓ విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారు తీసుకున్న ఆహారం గురించి వివరాలు తెలుసుకున్నారు. అలాగే వారికి ఎదురైన లక్షణాల గురించి ఆరా తీశారు. ఎక్కువగా విద్యార్థులు వాంతులు మరియు కడుపు నొప్పి సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. తదుపరి డిఎం అండ్ హెచ్ఓ మణుగూరు లోని ఎంజేపిటిసి బిసి హాస్టల్‌ను సందర్శించి, అక్కడ ఆర్‌బిఎస్‌కె బృందాలు, పీహెచ్‌సి మణుగూరు వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా హాస్టల్ స్టాఫ్ నర్స్‌కు విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే సమీపంలోని వైద్య అధికారులకు సమాచారం అందించాలని, అవసరమైనప్పుడు తక్షణ ప్రథమ చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉండగా, వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షణలో ఉంచి అవసరమైన చికిత్స అందిస్తున్నారు.

వేతనాలు లేక కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బతుకు భారం

ప్రజాపక్షం/మణుగూరు: తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల కింద పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయుష్, ఆర్బిఎస్కే , టిబి, యమ్సిహెచ్, బ్లడ్ బ్యాంక్ వంటి విభాగాలలో పని చేస్తున్న సుమారు 17,000 మంది ఉద్యోగులకు మూడు నుండి నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడం బతుకులు భారంగా మారినాయని, నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోఆర్డినేటర్ ప్రేమ్ కుమార్ వాపోయారు. ఈ ఉద్యోగులు జాతీయ ఆరోగ్య మిషన్ (నేషనల్ హెల్త్ మిషన్)కింద సేవలందిస్తున్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో వీరి పాత్ర ఎంతో కీలకం. అయితే వీరు అందిస్తున్న సేవలకు సరైన సమయంలో జీతాలు అందక పోవడం వల్ల వారి కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. జీతాల ఆలస్యం కారణంగా ఉద్యోగులు తమ ఇంటి అద్దె, పిల్లల చదువు, వైద్య ఖర్చులు, రోజువారీ అవసరాలు నిర్వహించడానికి కష్టపడుతున్నారు. చాలా మంది ఉద్యోగులు తమ కుటుంబాలను పోషించడానికి స్నేహితులు, బంధువులు లేదా ప్రైవేట్ అప్పులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితి వారి ఆర్థిక స్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో ముందుంటారు. టిబి నిర్మూలన, తల్లిశిశు ఆరోగ్యం, రక్త బ్యాంకు సేవలు, ఆయుష్ వైద్యం వంటి అనేక కీలక ఆరోగ్య కార్యక్రమాలను వీరు అమలు చేస్తున్నారు. ఇటువంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు జీతాలు సమయానికి అందకపోవడం ఆరోగ్య వ్యవస్థపైనా ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు. జీతాల బకాయిలను వెంటనే విడుదల చేసి, భవిష్యత్తులో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలను గుర్తించి, వారికి ఉద్యోగ భద్రత మరియు రెగ్యులరైజేషన్ వంటి అంశాలను కూడా పరిశీలించాలని కోరుతున్నారు. సమాజానికి ముఖ్యమైన ఆరోగ్య సేవలు అందిస్తున్న ఈ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించడం అత్యవసరం అని, జీతాలు సమయానికి అందితేనే వారు తమ కుటుంబాలను సురక్షితంగా చూసుకుంటూ, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించగలరని కోరారు. అసలుకే చాలీ చాలని జీతాలతో బతుకు భారం అవుతున్నాయా ఈరోజుల్లో నాలుగు నెలల జీతం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెల్లడించారు. ఇకనుంచైనా ప్రభుత్వం మేలుకొని సకాలంలో పలు వేతనాలు చెల్లించవలసిందిగా ప్రభుత్వాన్ని విన్నవించుకుంటున్నారు.

గురుకుల విద్యార్థుల అస్వస్థతపై సమగ్ర విచారణ చేపట్టాలి

జిల్లాలో అన్ని వసతి గృహాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి

భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు చేపట్టాలి : సిపిఐ డిమాండ్

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలంలోని ఎంబీసీ బాలిక గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ అస్వస్థతకు కారణమై విద్యార్థులు ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటున్న దానిపైజిల్లా కలెక్టర్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు చేపట్టాలని, సీపీఐ మణుగూరు మండల, పట్టణ కార్యదర్శి లు జక్కుల రాజబాబు, దుర్నాల సుధాకర్ లు డిమాండ్ చేశారు. మంగళవారం మణుగూరు లోని వంద పడకల ఆసుపత్రిలో విద్యార్థుల ను కలిసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ జరిగిందా, వంట లో కల్తీ ఇంకేమైనా జరిగిందా, అనే దానిమీద విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని, జిల్లాలో ఉన్నటువంటి అన్ని వసతి గృహాలను సంబంధిత అధికారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించాలని, హాస్టల్లో విద్యార్థులు ఏ విధంగా జీవిస్తున్నారు, ఏ విధంగా భోజన వసతి ఎలా ఉంది, తెలుసుకోవాలని, అధికారులే కాకుండా ఎమ్మెల్యే, ఎంపీలు కూడా హాస్టల్లో నిద్రించాలని అప్పుడే విద్యార్థుల సమస్యలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలుస్తాయని వారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలు వెచ్చించి వారికి అన్ని సదుపాయాలు అందించాలని లక్ష్యంతో చేస్తుంటే, ఇలా జరగడం దురదృష్టకరమని ఇలాంటి భవిష్యత్తులో జరగకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సందర్శించిన వారిలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సోందే కుటుంబరావు, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ వజ్రా వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు, కన్నెబోయిన ప్రసాద్, గారబోయిన నరేష్, గుంటక రంజిత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవుల సర్వేశ్వరరావు లు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై సిపిఎం నిరసన

ప్రజాపక్షం/ములకలపల్లి: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై భారీ భారం పడిందని విమర్శించారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మల మధు, బైరు ప్రసాద్, గడ్డం వెంకటేశ్వర్లు, వనమా రమేష్, కోర్సా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లుతో భిక్షమయ్య భేటీ

ప్రజాపక్షం/అశ్వాపురం: పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లును కాంగ్రెస్ పార్టీ అశ్వాపురం మండల అధ్యక్షులు భిక్షమయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మండలంలో ఉన్న పలు ప్రధాన సమస్యలను ఎంఎల్ఏకు వివరించి వినతి పత్రం అందజేశారు. అలాగే అశ్వాపురం మండలం, పినపాక నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లుతో ఓరుగంటి భిక్షమయ్య సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.

అశ్వాపురంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి

ప్రజాపక్షం/అశ్వాపురం: మాల జన సమితి ఆధ్వర్యంలో అశ్వాపురం మండలంలో భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా సమితి అధ్యక్షుడు చెట్టి సురేష్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే బాలికల విద్య కోసం పోరాడి పలు విద్యాసంస్థలు స్థాపించి మహిళా విద్యకు మార్గం చూపిన మహనీయురాలని తెలిపారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి ఆమె చేసిన త్యాగాలే కారణమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జూపల్లి ధ్రువకుమార్, చెట్టి మల్లేష్, మనోజ్, కరకపెల్లి డేవిడ్, గుణికంటి రవి, ఉండేటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం

ప్రజాపక్షం/అశ్వాపురం: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా అశ్వాపురం మండల కేంద్రంలో మంగళవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అటవీ క్షేత్రాధికారి ఉపేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసరాలను శుభ్రపరచడంతో పాటు మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని అధికారులు సూచించారు. ఈకార్యక్రమంలో అటవీ శాఖ డీఆర్ఓ, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీల నిరసన

-నాలుగు వారాలుగా వేతనాలు లేక ఆందోళన

ప్రజాపక్షం/చండ్రుగొండ: నాలుగు వారాలుగా ఉపాధి హామీ వేతనాలు అందకపోవడంతో చండ్రుగొండ మండలం సీతాయిగూడెం గ్రామానికి చెందిన కూలీలు మంగళవారం ఎంపిడిఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కూలీలు మాట్లాడుతూ ఉపాధి పనులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నప్పటికీ వారం వారం ఇవ్వాల్సిన వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు తెలిపినా స్పందన లేకపోవడంతో కార్యాలయానికి రావాల్సి వచ్చిందన్నారు. అక్కడికి వచ్చిన ఎంపిడిఓ అశోక్ కూలీలతో మాట్లాడి త్వరలోనే వేతనాలు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కూలీలు వెనుదిరిగారు. ఈ సమస్య మండలంలోని ఇతర గ్రామాలో కూడా ఉందని కూలీలు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

సిపిఐ నూతన ప్రజాప్రతినిధులకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్

- ప్రారంభించనున్న కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తరుపున నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లైన ప్రజా ప్రతినిధులకు జిల్లాలోని పాల్వంచలో రెండురోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుగున ఫంక్షన్ హాల్లో 13,14 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు తొలి రోజు ఉ.10గం.లకు ప్రారంభిస్తారన్నారు.ముఖ్యాతిథిలుగా సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ డా.కే నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, కే రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషాతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ వర్క్‌షాపులో ప్రజాప్రతినిధులకు పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ కోదండ రామ్, ప్రొఫెసర్ హరగోపాల్, పరకాల ప్రభాకర్, ప్రొఫెసర్ ఖాసీం, ప్రొఫెసర్ నాగేశ్వరరావు వంటి వ్యక్తులు వస్తున్నారన్నారు. ఈ రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాపుకు ప్రజాప్రతినిధులతో పాటు నియోజకవర్గ పుర ప్రముఖులు, వార్డు సభ్యులు వాల్గొని జయప్రథం చేయాలని పాషా కోరారు.

భద్రాద్రిలో నాదోపాసన సంగీత లహరి

ప్రజాపక్షం/భద్రాచలం : గోదావరి నదీ హారతిని పురస్కరించుకుని ఈ ఆదివారం 15వ తేది నాడు నాదోపాసన ప్రత్యేక భక్తి సంగీత సంగీత సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సా. 5.30 గం. నుండి మొదలుకుని గంటపాటు ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి డా. సింధుజ కూచిపూడి నృత్య ప్రదర్శన, 6.30 నుండి గోదావరి నదీహారతి, 7 గం. నుండి ప్రపంచ ప్రఖ్యాత గాత్ర విద్వాంసులు ప్రియా సిస్టర్స్, షణ్ముక ప్రియ, హనీప్రియ సోదరీమణుల గాత్ర కచేలి ఉంటుందని చెప్పారు. ఈ నాదోపాసన కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రథం చేయాలని సబ్ కలెక్టర్ కోరారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి: బొర్రా ఉమాదేవి

3వ వార్డులో స్వచ్ఛత కార్యక్రమం

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం 3వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ బొర్రా ఉమాదేవి, మున్సిపల్ కమీషనర్ గురులింగం, శానిటరీ ఇన్స్పెక్టర్ వీరన్నతో కలిసి వార్డులోని అంతర్గత రహదారులను స్వయంగా ఊడుస్తూ శుభ్రపరించారు. ఈ సందర్భంగా వారు వార్డులోని మురుగు కాల్వలను పరిశీలించి వాటిలో పేరుకుపోయిన సిల్ట్ను ఎప్పటికప్పుడు తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని శానిటరీ సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే పారిపుధ్య నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విధంగా నిరంతరం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బొర్రా ఉమాదేవి మాటాలడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్ధంగా అమలు చేస్తుందని

తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ నాయకులు పర్సా రవి, బాసాటి రామారావు, ఉయ్యూరు నాగేశ్వరరావు, సురభవి శ్రీను, పంది కృష్ణవేణి, ఏదునూరి కోటయ్య, గాలీబు సైదులు, మోటప్తోల భద్రాచలం, కట్ల వెంకన్న, పామర్తి వెంకన్న, సురభి వాసు, తెలగారపు శ్రీను, యదవల్లి శ్రీను, వార్డు శానిటరీ ఇంచార్జి ఇండ్ల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించాలి

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు సోమవరం రైతు వేదిక నందు వ్యవసాయ సాంకేతిక యాజమాన సంస్థ ఆత్మ వారి ఆధ్వర్యంలో రైతుకలు, వ్యవసాయ శాస్త్రవేత్తలకు మధ్య చర్చ గోష్టి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, వైరా వ్యవసాయ సహాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ, మట్టూరి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు వినియోగించాలని సూచించడం జరిగింది. ఇందులో భాగంగా యూరియా యాప్ యొక్క వినియోగం బుక్ చేసుకునే విధానం సాగును జోడించే వివరాల గురించి రైతులకు తెలియజేయడం జరిగింది. అంతేకాకుండా ఆయిల్ ఫామ్‌లో వరి అంతర పంటగా సాగు చేయు విధానం , మెలవకులు గురించి తెలియజేయడం జరిగింది. అత్యంత వ్యవసాయ నూతన వ్యవసాయ పద్ధతుల గురించి వివరించడం జరిగింది. అదేవిధంగా నానో యూరియా వాడకం ఇతర డ్రోన్ స్ప్రే చేయడం ఇటువంటి ఆధునిక వ్యవసాయ విధానం రైతులు అలవరచుకోవాలని ఈ కార్యక్రమంలో వైరా కెవివి శాస్త్రవేత్త పావని, మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, హార్టికల్చర్ ఆఫీసర్ వేణు, విస్తరణ అధికారులు వెంపటి కీర్తి, వాసంతి పరిటాల వెంకయ్య, సపావత్ సైదులు, మేడా రాజేష్, అదేవిధంగా వార్డు కౌన్సిలర్ డి.వెంకటేశ్వర్లు, రైతులు షేక్ సైదులు, కొల్లి హనుమంతరావు, కొల్లి నర్సింహారావు, శ్రీను, నాగబత్తిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు వేంటనే తగ్గించాలి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : పేద మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచే విధంగా పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రం లోని కర్నాటి నగర్ లో మంగళవారం ఖాళీ గ్యాస్ సిలిండర్ లతో నిరసన కార్యక్రమాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపే విధంగా గ్యాస్ సిలిండర్ ధరలను పెంచిందన్నారు. వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.115 పెంచడం వల్ల హోటల్ రెస్టారెంట్లో ఆహార పదార్థాలు ధరలు పెరిగి ప్రజలపై అదనపు భారం పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అలాగే గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.60 పెంచడం వల్ల పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కునే పరిస్థితి ఏర్పడింది అన్నారు. ఈ విధంగా ధరలు పెరగడం వల్ల అన్ని వస్తువుల ధరలపై ప్రభావం పడుతుందని, ప్రజలు కొనలేని పరిస్థితి దేశాన్ని నెట్టివేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా

సామ్రాజ్యం వాదానికి లొంగి దేశ స్వతంత్ర విధానాలను భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తుందిన్నారు. భారతదేశ ఫదరల్ వ్యవస్థను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రపంచ శాంతిని కాపాడే విధంగా అలీన విధానాన్ని అమలు చేసి యుద్ధాలు ఆపేందుకు కృషి చేయాలని కోరారు ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ మహిళా సంఘం నాయకురాలు మారిశెట్టి విజయ దుర్గ, బడుగు రాజేశ్వరి,కట్టేకొల ఉషా, బడుగు మాధవరావు,గుడిమెట్లా శ్రీనివాస్ రావు, ఎచ్చెర్ల గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల గ్రంథాలయం ప్రారంభం

కార్టూనిస్ట్ పి.శంకర్ పుస్తకాలు అందజేత

ప్రజాపక్షం/నేలకొండపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం ను మంగళవారం ప్రారంభించారు. నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కు చెందిన పదో తరగతి 1989 నాటి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సేకరించిన రూ.1.70 లక్షలతో భక్తరామదాసు స్మారక గ్రంథాలయం ను ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయంలో మొత్తం 2500 పుస్తకాలను సిద్ధంగా ఉంచారు. రిటైడ్ అసిస్టెంట్ కలెక్టర్ గండికోట భాస్కర్, పూర్వ విద్యార్థులు కలిసి అట్టహాసంగా ప్రారంభించారు. కార్టూనిస్ట్ పి.శంకర్, సతీమణి, జీ.మంగ స్థానిక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని కావటంతో ఆయన పెద్ద మొత్తంలో పుస్తకాలను అందించారు. ఈ మేరకు ఆయన సతీమణి, చేతుల మీదుగా నిర్వహాకులకు అందించారు. జాతీయ నాయ

కులచిత్రాలను తను గీసిన చిత్ర పటాలను అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతి రావు మాట్లాడారు. పూర్వ విద్యార్థుల కృషిని ప్రశంసించారు. విద్యార్థులకు అవసరమైన గ్రంథాలయం ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. వీరి స్ఫూర్తితో పూర్వ విద్యార్థులు కూడ సేవ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపగాని రమేష్, సర్పంచ్ వెంకట లక్ష్మి, వార్డు సభ్యుడు వంగవీటి పవన్, పూర్వ విద్యార్థులు రేలా నరసింహారెడ్డి, పుల్లారావు, పాపారావు నోముల క్రిష్ణవేణి పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ఇందిరమ్మ కాలనీ మార్కెట్ యార్డ్ ప్రాంతాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మంగళవారం పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఉన్న చెత్తను పూర్తిగా తరలించేందుకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజ్ గుంటను పరిశీలించారు. ఇందిరమ్మ కాలనీ పరిసర ప్రాంతాలు మొత్తం శుభ్రంగా ఉండాలని ఎక్కడ పారిశుద్ధ్య లోపం కనిపించకూడదని ఆయన తెలిపారు. ప్రజలు కూడా తమ ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడి బడితే అక్కడ వ్యర్థ పదార్థాలు వేయవద్దని, మనం ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటే మన ఆరోగ్యాలు అంత మంచిగా ఉంటాయని కట్ల సంతోష్ తెలిపారు. ఈకార్యక్రమంలో ముదిగొండ మహేష్, ఇందిరమ్మ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రముఖ రచయిత, అభ్యుదయ వాది రోశయ్యకు ఘన సన్మానం

ప్రజాపక్షం/ మధిర : ప్రముఖ అభ్యుదయవాది, రచయిత మధిర పట్టణానికి చెందిన రామిశెట్టి రోశయ్యను సిపిఐ, వికాస వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత ఉత్సవాలను పురస్కరించుకుని నూరేళ్ల అరుణ కేతనం అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఈ సందర్భంగా అభ్యుదయ, ప్రజా రచయితల నుండి రచనలను

ఆహ్వానించగా రామిశెట్టి రోశయ్య కూడా నూరేళ్ల అరుణ కేతనం పుస్తకానికి ఒక కవితను పంపించారు. ఈ పుస్తక ఆవిష్కరణ ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పుస్తకానికి రచనలను పంపిన ప్రతి ఒక్కరిని ఆరోజు సన్మానించారు. ఆరోగ్య రీత్యా రామిశెట్టి రోశయ్య నూరేళ్ల అరుణ కేతనం ఆవిష్కరణ సభకు హాజరు కాలేకపోయారు. మంగళవారం సిపిఐ, వికాస సాహిత్య వేదిక బాధ్యులు రోశయ్య ఇంటి వద్ద సన్మానించి నూరేళ్ల అరుణ కేతనం పుస్తకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్, అరసం బాధ్యులు ఎన్. కాంతేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి , బెజవాడ రవిబాబు, సిపిఐ నాయకులు ప్రకాశరావు, చెరుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

99 రోజుల ప్రణాళికలో పారిశుద్ధ్య పనులకు పరిష్కారం: కౌన్సిలర్ విజయలక్ష్మి

ప్రజాపక్షం/వైరా: వైరా ప్రభుత్వ ఆసుపత్రి ప్రక్కన ఓల్డ్ క్యార్టర్స్‌లో పేరుకుపోయిన చెత్త, డ్రైనేజీ సమస్యలను మున్సిపాలిటీ సిబ్బందితో శుభ్రం 13వ వార్డు కౌన్సిలర్, వైరా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి విజయల సీతారాములు క్లీన్ చేయించారు. ఈ సందర్భంగా

ముళ్ళపాటి విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రగతి ప్రణాళిక వార్డుల్లోని సమస్యలను పరిష్కరించే దిశగా చూస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బొగ్గుల సత్తిరెడ్డి, మిరియాల శ్రీనివాసరావు, పటాన్ హైమద్‌కాన్, బానోత్ విజయ్, పసుపులేటి మోహన్‌రావు, అక్కిశెట్టి నాగు, మొరం రామ్మూర్తి, బొడ్డుపల్లి కృష్ణశాస్త్రి, పసుపులేటి రాంబాబు, జూపూడి శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఎదుగుదలకు ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలి

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు సోమవారం కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు గ్రామంలోని పిహెచ్‌సిలో ఉన్న మహిళ ఉద్యోగులను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ పవిత్రకుమారి, మహిళా వైద్య సిబ్బందితో కలిసి కేక్ కట్‌చేశారు.

అనంతరం కౌన్సిలర్ వెంకటేశ్వరరావు వైద్య సిబ్బందిని శాలువా కప్పి ప్రతిఒక్కరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దొంతెబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళ ఎదుగుదలకు తోడ్పాటు అందించాలి. వైద్యసేవలు ఎప్పటికీ మరిచిపోలనివి కరోనా సమయంలో మహిళా ఉద్యోగులు ప్రాణాలను సైతం పనంగా పెట్టి ప్రజలకు సేవలందించారని, అలాంటి మహిళ వైద్యసిబ్బందిని సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణ, పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తా : సునీత

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో వాసవి కళ్యాణ మండపం వెనుక భాగంలో డ్రైనేజీలను ఆ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ సోమవారం మున్సిపల్ సిబ్బందితో కలిసి డ్రైనేజీలో పూడికతీత పిచ్చిమొక్కలు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆ వార్డులోని ప్రజలు కౌన్సిలర్ సునీత దృష్టికి ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కల పెంపకం గురించి వివరించారు. త్వరలోనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తానని సునీత తెలిపారు.

రేపు జాబ్ మేళా నిర్వహణ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేట్ రంగం ఖమ్మం ఆర్కా రెనాల్ట్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు రేపు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టు పక్కన గల ఆర్కా రెనాల్ట్ నందు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్కా రెనాల్ట్ ఖమ్మంలో ఫీల్డ్ సేల్స్, కన్సల్టెంట్స్, సేల్స్ టీమ్ లీడర్స్, యూజ్డ్ కాల్, ఎవల్యూటర్స్ ఉద్యోగాలకు డిగ్రీ, మెకానిక్ డిప్లోమా, బిటెక్ మెకానిక్ అర్హత గల వారు అర్హులని ఎంపికైన వారికి వేతనం రూ. 18వేల నుంచి రూ. 30వేలు, ఇన్సెంటీవ్స్ ఉంటాయని తెలిపారు. మొత్తం 35 ఉద్యోగాల ఖాళీల భర్తీకి గాను జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇట్టి ఉద్యోగ ఖాళీలు ఖమ్మం, సత్తుపల్లి, మధిర ప్రాంతాల్లో ఉంటాయని తెలిపారు. ఆసక్తి, అర్హత గల 22 నుంచి 33 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు.